
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 29.0 । కనిష్ఠం: 16.0

ANDHRAJYOTHY



జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

మంగళవారం 9 డిసెంబరు 2025

ప్రజాప్రతినిధుల విస్తృత ప్రచారం

- మద్దతుదారులను గెలిపించుకునేందుకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల పాట్లు
- మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రం మంతనాలకే పరిమితం

7



ఎక్కువ కేసులు పరిష్కరించాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. ప్రేమలత

7

సర్పంచ్‌కు ఓట్లు... పొలాలకు తీరిన దారి పాట్లు

- ఎన్నికలు ముగియకముందే దీర్ఘకాల సమస్య పరిష్కారం

7

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఖిల్లాఘణపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి


ఖిల్లాఘణపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని, ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు ఏర్పాటు చేసిన సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రక్రియంలో ప్రతీ ఓటు కీలకమని తెలిపారు. ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఫారం 14 దరఖాస్తు చేసుకున్న వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా సిబ్బంది సహకరించాలన్నారు. పోలింగ్ సమయంలో లోపాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలని ఉద్యోగులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుగుణ, ఎంపీడీవో విజయసింహారెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్నంలో.. పంచాయతీ

వలస ఓటర్లను రప్పించేందుకు నగరాల్లో కసరత్తు



- ప్రత్యేక వాహనాల ఏర్పాటు.. దారి ఖర్చు ఇచ్చి ఓట్ల అభ్యర్థన
- ఆన్‌లైన్ ద్వారా యువకులకు దావత్ కోసం డబ్బులు
- ఆయా పట్టణాల్లో ప్రత్యేక సమావేశాల నిర్వహణకు ప్రణాళిక
- హైదరాబాద్, పుణె, ముంబైకి అభ్యర్థుల అనుచరుల పయనం





మహబూబ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికలు కీలక దశకు చేరుకుంటున్నాయి. మొదటి దశ పోలింగ్ ఎల్లుండి గురువారం జరుగనుంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో అభ్యర్థులు, వారికి మద్దతు ఇస్తున్న పార్టీల నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎలాగైనా పంచాయతీ స్థానాన్ని గెలుచుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధికి ఏం చేస్తామో కొందరు బాండ్ పేపర్లపై రాసి ఇస్తుండగా.. మరికొందరు తీర్మానాలు చేస్తున్నారు. ప్రధానంగా దేవాలయాల అభివృద్ధి, సమూహిక అవసరాలకు ఉపయోగపడే వాటికి ఆర్థిక సాయం చేస్తామని చెబుతున్నారు. ఇవన్నీ గ్రామాల్లో ఉండే వారు అనుభవిస్తారు కాబట్టి వారు ఆ హామీల ఆధారంగా ఓట్లు వేస్తారు. మరి పట్టణాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉండేవారు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అధిక సంఖ్యలో ఉంటారు. దాంతో వారిని ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఒక్కో ఊరిలో ఇలాంటి వారు కనీసం 100 నుంచి గ్రామ జనాభాను బట్టి 500 మంది ఓటర్ల వరకు ఉంటారని అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ఓట్లు చాలా కీలకంగా మారనున్నాయి. అందుకే వారి ఓట్లు గంపగుత్తగా ఎవరికి పడితే వారు విజయం సాధించవచ్చనే భావన కూడా అభ్యర్థుల్లో ఉంది. ప్రధానంగా ఉమ్మడి పాలమూరు జిల్లా ఓటర్లు హైదరాబాద్, ముంబై, పుణె, బెంగళూరు వంటి పట్టణాల్లో స్థిరపడ్డారు. ఇప్పుడు వారి వద్దకు నేరుగా అభ్యర్థులు పరుగులు పెట్టడం లేదా వారి అనుచరులను పంపించడం చేస్తున్నారు. డబ్బు రవాణాపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉండటంతో అంతా ఆన్‌లైన్ ద్వారా పేమెంట్లు చేస్తున్నారు. ఓవైపు గ్రామీణ ప్రాంతాల్లో దావత్‌లు జరుగుతుండగా.. పట్టణ ప్రాంతాల్లో వారికి

(మిగతా 6లో..)

కోయిల్‌కొండ మండలంలో 75 గిరిజన తండాలు ఉన్నాయి. ఎక్కువగా పుణె, ముంబైలో పనికోసం వెళ్లారు. వారిని తెచ్చేందుకు ప్రైవేటు బస్సులను బుక్ చేశారు. ఒక్కొక్కరికి రూ. 2,000 ఇవ్వడానికి సిద్ధం అవుతున్నారు. ఇక్కడి నుంచి పనికి తీసుకెళ్లిన గుంపుమేస్త్రీల ద్వారా ఓటర్లను తేవడానికి ప్రయత్నిస్తున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ ఓటర్లు ఎక్కువగా హైదరాబాద్‌లో ఉండటంతో అలాంటి ఓటర్ల వివరాలు తీసుకుని పట్నంబాట పట్టారు. మండల కేంద్రానికి సంబంధించిన ప్రధాన అభ్యర్థులు హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాలులో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. మరో అభ్యర్థి ఒక హోటల్‌లో సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. వాహనాలు పెట్టడంతోపాటు ఖర్చులకు రూ.3,000 నుంచి రూ. 5,000 వరకు ఇస్తామని చెబుతున్నారు.



నేటితో మొదటి విడత.. ప్రచారానికి తెర



మొదటి విడత ఎన్నికలు జరుగనున్న గద్వాల మండలంలోని వీరాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం

- 11వ తేదీన పోలింగ్..
- గ్రామాల్లో హోరెత్తుతున్న ప్రచారం
- చివరిరోజు జోరందుకోనున్న మద్యం, నగదు పంపిణీ ..!
- నేడు మూడోవిడత నామినేషన్ల ఉపసంహరణ

నాగర్‌కర్నూల్/గద్వాల/వనపర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పోరు అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తోంది. నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో మొదటి విడత ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచార ఘట్టానికి నేటితో తెర పడనుంది. వారం రోజులుగా మైకులతో హోరెత్తిన గ్రామాలు నేటి సాయంత్రానికి మూగబోనున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మెజార్టీ స్థానాల్లో తమ మద్దతుదారులు విజయం సాధించేలా ప్రచారం చేస్తున్నారు. అందుకు దీటుగా బీఆర్‌ఎస్ కూడా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పల్లెల్లో అధికార పార్టీకి ధీటుగా ప్రచారం చేస్తున్నారు. చివరి రోజు ప్రచారానికి వనపర్తి జిల్లాలో ఆయా పార్టీలు బలపరిచిన అభ్యర్థులు ముఖ్య నాయకులను ఆహ్వానిస్తున్నారు.

జోరందుకున్న ప్రచారం..

నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదటి దశ ఎన్నికలు జరగనున్న కల్వకుర్తి, వెల్దండ, వంగూరు, ఊర్కొండ, తాడూరు, తెలకపల్లి మండలాల్లో ప్రచారం జోరందుకున్నది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఎమ్మెల్యే ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తోంది. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని తాడూరు, తెలకపల్లి మండలాల్లోని గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డిలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కల్వకుర్తి మండలంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రచారంలో నిమగ్నమయ్యారు.

పట్నంలో ఉన్న ఓటర్లకు బంపర్ ఆఫర్..

సర్పంచ్ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఖర్చుకు వెనుకాడటం లేదు. ఈ క్రమంలో హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారిని స్వగ్రామాలకు రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఆటోలు నడుపుతూ స్థిరపడిన వారికి బంపర్ ఆఫర్ ఇస్తున్నారు. ఆటోలో కుటుంబ సభ్యులను తీసుకొస్తే వారికి ఆటోకు సంబంధించిన మూడు కొత్త టైర్లను ఇప్పించడంతోపాటు డీజిల్, దావత్ కోసం రూ.3 వేలు ఇస్తామని మధ్యవర్తుల ద్వారా సందేశాలు పంపుతున్నారు. దీంతో వారంతా స్వగ్రామాలకు రావడానికి సిద్ధమవుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో గెలుపు సునాయాసం చేసుకోవడానికి ఇప్పటికే ప్రధాన రాజకీయ పక్షాలు హైదరాబాద్‌లో స్థిరపడిన ఓటర్లకు వివిధ ఫంక్షన్ హాళ్లలో విందు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

నాగర్‌కర్నూల్ జిల్లాలో..

నాగర్‌కర్నూల్ జిల్లాలో 20 మండలాల్లో 460 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొదటి విడత ఎన్నికలు ఈ నెల 11న కల్వకుర్తి, వెల్దండ, వంగూరు, ఊర్కొండ, తాడూరు, తెలకపల్లి మండలాల పరిధిలోని 151 గ్రామ పంచాయతీలకు నిర్వహించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు 14 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కావడంతో మిగతా చోట్ల ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో..

మొదటి విడుతలో జిల్లాలో గద్వాల, ధరూర్, గట్టు, కేటీదొడ్డి మండలాల్లోని 106గ్రామ పంచాయతీలు, 794 వార్డు సభ్యులకు నోటిఫికేషన్ జారీ చేశారు. నామినేషన్లు పూర్తి అయిన తర్వాత ఇందులో 15గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 91గ్రామ పంచాయతీలలో ఈ నెల 11వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచుకు 325 మంది, వార్డు సభ్యుల కోసం 1,425 మంది పోటీలో నిలిచారు.

వనపర్తి జిల్లాలో..

వనపర్తి జిల్లాలో మొదటి విడతలో పెద్దమందడి, ఖిల్లాఘణపురం, రేవల్లి, గోపాల్‌పేట, ఏదుల మండలాల్లోని 87 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు నిర్వహించనున్నారు. 87 సర్పంచ్ స్థానాలకు గాను 287 మంది సర్పంచ్ అభ్యర్థులు, 780 వార్డు స్థానాలు గాను 1,716 మంది వార్డు అభ్యర్థులు బరిలో ఉన్నారు.

రేషన్ షాపుల్లో పురుగుల బియ్యం

- అచ్చంపేట పట్టణంలోని చౌకధరల దుకాణాల్లో గుర్తింపు
- తహసీల్దార్ సైదులు ఆకస్మిక తనిఖీ

7

రెబల్ అభ్యర్థులతో మంతనాలు

- కిటకిటలాడిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

7

ప్రత్యర్థులు అవమానించారని యువకుడి ఆత్మహత్యాయత్నం

- గట్టు మండలం యల్లందొడ్డిలో సంఘటన

7

ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తాం

కొనసాగుతున్న గోకారం రిజర్వాయర్ భూనిర్వాసితుల రిలే దీక్ష

6

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 141.00
హోల్ సేల్	: 149.00
డ్రెస్డ్	: 254.00
స్కిన్ లెస్	: 277.00

పక్కాగా లెక్కలు చెప్పకపోతే చిక్కులు

- ఎన్నికల ఖర్చులను సక్రమంగా నమోదు చేయాలి
- 45 రోజుల్లోగా ఎంపీడీవోలకు అందించాలి
- గెలిచినా, ఓడినా అభ్యర్థులపై తప్పని చర్యలు

7



శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడుదాం

- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు
- గద్వాలలో జిల్లాస్థాయి మహాసభ

6



మహాసభలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

- గన్నీ బ్యాగులు లేక అన్నదాతల అవస్థలు
- క్వింటాలుకు 6 కిలోల తరుగు తీస్తున్నారని ఆరోపణ



కొనుగోళ్లు నిలిచిపోవడంతో పులికల్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం

అయిజ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షాకాలంలో అధిక వర్షాలతో సాగుచేసిన పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. అధిక వర్షాలతో ఒక్క మొక్కజొన్న పంట తప్ప అన్ని పంటలు దెబ్బతిన్నాయి. వరిపైరుకు సకాలంలో యూరియా అందక కూడా దిగుబడి తగ్గింది. ఎకరాకు దాదాపు 30 క్వింటాళ్ల ధాన్యం వచ్చేది. ఈ ఏడాది 22 క్వింటాళ్ల లోపే దిగుబడి వచ్చింది. ఇదిలా ఉండగా కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో మోసం చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా సకాలంలో గన్నీ బ్యాగులు అందించడం లేదని, తూకం చేసిన ధాన్యం కూడా ఎత్తడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 75 కొనుగోలు కేంద్రాలు

జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా జూరాల, ఆర్డీఎస్, బోరుబావులు, చెరువులు, కుంటల కింద వానాకాలంలో మొత్తం 38,743 హెక్టార్లలో వరి సాగు చేశారు. 2,59,776 మెట్రిక్ టన్నులు సన్న రకం, 3.120 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 75 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తున్నారు. కానీ సకాలంలో సంచులు అందించకపోవడం తో ఇబ్బంది పడుతున్నామని అన్నదాతలు వాపోతున్నారు. ఆర్డీఎస్ పరిధిలో బైనపల్లి, రాజాపూర్, పులికల్ తదితర గ్రామాల్లో సంచులు లేక సోమవారం కొనుగోళ్లు జరగలేదు.

తూకాల్లో మోసం..

ప్రతీ 40 కిలోల సంచిలో దాదాపు 2.3 కిలోలు అధికంగా తూకం చేస్తున్నారు. సంచి తూకం కిలో తీసినా ఇంకా రెండు కిలోల లెక్క ఏంటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. క్వింటాలు ధాన్యం తూకం రావాలంటే 6 నుంచి 8 కిలోల వరకు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎత్తేటప్పుడు.. మిల్లు వద్ద దించే సమయంలో హమాలీ భారం రైతులపై వేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. ఉన్నత స్థాయి అధికారుల ఆకస్మిక తనిఖీలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

తూకాలలో మోసం జరిగితే చర్యలు

రైతులకు కొనుగోలు కేంద్రాలలో ఎక్కడ ఇబ్బందులు రాకుండా చూసుకుంటాం. నిర్దేశించిన మేరకు కొనుగోళ్లు జరగాలి. తూకాలలో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

– స్వామికుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

మస్తీపూర్ వద్ద నగదు పట్టివేత

అమరచింత, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని మస్తీపురం ఎక్స్‌రోడ్డు వద్ద రూ.1,27,510 తరలిస్తుండగా సోమవారం రాత్రి అమరచింత పోలీసులు పట్టుకున్నారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో అమరచింత పోలీసులు తనిఖీలు చేపడుతుండగా ఓ వ్యక్తి మస్తీపూర్ వైపున నగదు తీసుకువెళ్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు అమరచింత ఎస్ఐ స్వాతి తెలిపారు. ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ నగదు తరలిస్తే సీజ్ చేస్తామని సూచించారు.

కల్వకుర్తిలో చోరీ

- 40 తులాల బంగారు ఆభరణాలు, రూ.6 లక్షల నగదు అపహరణ



చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐలు మాధవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి

కల్వకుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాళం పగులగొట్టి 40 తులాల బంగారు ఆభరణాలు, రూ. 6 లక్షల నగదును చోరీ జరిగిన సంఘటన సోమవారం ఉదయం కల్వకుర్తి పట్టణంలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని నివాసం ఉంటున్న శ్రీనివాస్‌శర్మ వారం రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వేరే ఊరికి వెళ్లారు. సోమవారం తిరిగి ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూస్తే వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇంట్లో దాచి ఉంచిన 40తులాల బంగారం, రూ.6లక్షల నగదు కన్పించలేదు. దీంతో వెంటనే ఆయన పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం ద్వారా దొంగల ఆచూకీ కోసం నమూనాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జీ మాధవరెడ్డి, తెలిపారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ నాగార్జునలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

- జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్

వనపర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని, సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ పోలీసు కార్యాలయంలో వనపర్తి జిల్లా పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 11, 14, 17వ తేదీలలో మూడు విడతల్లో నిర్వహించే ఎన్నికలలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద అక్రమంగా డబ్బు, మద్యం రవాణా జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్ రావు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, సీఐలు కృష్ణయ్య, రాంబాబు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్ పాదయాత్రలో నర్సాయిపల్లి యువకుడు



గుజరాత్‌లో జరిగిన పాదయాత్రలో పాల్గొన్న నర్సాయిపల్లి యువకుడు రాజేందర్‌గౌడ్

కోడేరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని గుజరాత్ రాష్ట్రంలో నిర్వహిస్తున్న పాదయాత్రలో నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన యువకుడు సానెగౌని రాజేందర్‌గౌడ్ పాల్గొనట్లు సోమవారం గ్రామస్థులు తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ తరఫున గుజరాత్ రాష్ట్రంలో నవంబరు 26 నుంచి డిసెంబరు 6వరకు నిర్వహించిన పాదయాత్రలో రాజేందర్‌గౌడ్ పాల్గొని 150 కిలోమీటర్ల పాదయాత్రలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వం దిగివచ్చే వరకు
పోరాటం కొనసాగిస్తాం



రిలే నిరాహార దీక్ష చేస్తున్న భూ నిర్వాసితులు

చారకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డిండి - నార్లాపూర్ ఎత్తిపోతల పథకంలో భాగంగా చారకొండ మండలంలోని గోకారం వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించి ఎర్రవల్లి, ఎర్రవల్లితండా గ్రామాలు ముంపునకు గురికాకుండా చూడాలని లేకుంటే ప్రభుత్వం దిగి వచ్చే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని భూ నిర్వాసితుడు ప్రకాష్ అన్నారు. ఎర్రవల్లిలో అంబేడ్కర్ చౌరస్తాలో గ్రామస్థులు, భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 7వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా భూ నిర్వాసితుడు ప్రకాష్ మాట్లాడుతూ రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించి గ్రామాలు ముంపునకు గురికాకుండా చూడాలని ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు చెప్పినా ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం తీసుకొచ్చిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రాథమిక నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు అందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూనిర్వాసితులు పెద్దయ్యగౌడ్, సంజీవ, ప్రేమయ్య, గోపాల్, శంకర్, భాగ్యమ్మ, కేశమ్మ, అంజయ్య, రాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థికి పతకాలు



కిక్ బాక్సింగ్‌లో మెడల్స్ సాధించిన విద్యార్థి సిద్దార్థను అభినందిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమాదేవి

ఖిల్లాఘణపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని దొంతికుంటతండా పీఎంశ్రీ మోడల్ స్కూల్ విద్యార్థి పి.సిద్ధార్థ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో అండర్-15 విభాగంలో మోడల్ స్కూల్‌లో 8 తరగతి చదువుతున్న పి.సిద్ధార్థ పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారని అన్నారు. 45 కేజీల వెయిట్ క్యాటగిరి పాయింట్ ఫైట్ ఈవెంట్‌లో వివిధ విభాగాల్లో ప్రతిభ చాటి సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ బాక్సిం గ్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ పొందాలని ప్రోత్సహించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కిక్ బాక్సింగ్‌లో ప్రతి భ చాటిన విద్యార్థి సిద్ధార్థను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించా రు. పీఈటీ చందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎర్రవల్లి,డిసెంబరు,8(ఆంధ్రజ్యోతి) పవిత్రపుణ్యక్షేత్రమైన బీచుపల్లి కొదండరామాస్వామి అలయంలో సోమవారం సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారి కళ్యాణోత్సవంకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కనులార వీక్షించారు. కళాంమణనికి హాజరైన భక్తులకు వనపర్తికి చెందిన అనూష,నితిన్‌చంద్ర దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు అలయ మేనేజర్ సురేందర్‌రాజ్ తెలిపారు.

వేతనాలు అందక ఇబ్బందులు

- క్షేత్ర స్థాయిలో పశువులకు ప్రథమ చికిత్స చేస్తున్న గోపాలమిత్రలు
- తొమ్మిది నెలలుగా వేతనాలు అందక తిప్పలు



పశువులకు టీకాలు అందిస్తున్న గోపాలమిత్రలు(ఫైల్)

కోస్గి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పశు సంపద, రక్షణలో కీలకపాత్ర పోషించే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గోపాలమిత్రలు కోరుతున్నారు. గౌరవ వేతనంతో సేవలందిస్తున్న తాము తొమ్మిది నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అందించే వేతనం నెలకు రూ.11,050 అందాలి కానీ తొమ్మిది నెలలుగా ఆ వేతనాలు అందకపోవడంతో అప్పులతో కుటుంబాలను నడుపుకుంటున్నా మని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో250 మంది గోపాలమిత్రలు ఉన్నారు.

గోపాలమిత్రలకు చేయూత

పశుగణాభివృద్ధి శాఖ జిల్లా లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ద్వారా జిల్లాలో 2000వ సంవత్సరంలో గోపాలమిత్ర వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గోపాలమిత్రలు పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడంతో పాటు పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు ప్రథమచికిత్స అందిస్తున్నారు. రైతుల ఇళ్లకు వెళ్లి పశువులకు కృత్రిమ గర్భధారణ టీకాలు, నట్టల నివారణ మందులు వేయడం, గర్భకోశ వ్యాధులు, జబ్బవాపు, గొంతువాపు నివారణకు హెచ్‌ఎస్ టీకాలు వేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన, విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నారు.

గోపాలమిత్రల టార్గెట్

గోపాలమిత్రల సిబ్బంది నెలకు మండలంలో 60 నుంచి 80 పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలి. దీనికి రూ.40 రైతుల నుంచి వసూలు చేసి ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలి. ప్రతీనెల నిర్దేశించిన లక్ష్యాన్ని గోపాలమిత్రలు పూర్తిచేయాలి. లేకపోతే నెలజీతంలో కోత తప్పదని వాపోతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి..

గ్రామీణ ప్రాంత పశుసంపద, పాడి అభివృద్ధికి పనిచేస్తున్నాం. పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టులను సీనియర్ గోపాలమిత్రలకు అవకాశం కల్పించాలి. ఉద్యోగభద్రత కల్పిస్తు, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి.

- రవీందర్, గోపాలమిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడుదాం

- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు
- జిల్లా కేంద్రంలో నాలుగవ జిల్లా స్థాయి మహాసభ



మహాసభల్లో యూనియన్ జెండాను ఎగురవేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

గద్వాల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు ఉపయోగపడే శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నాగరాజు అన్నారు. అదే సమయంలో మూఢ నమ్మకాలను, మతోన్మాదాన్ని పెంచి పోషించే విధంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానాన్ని విద్యార్థిలోకం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయం వద్ద సోమవారం పీడీఎస్‌యూ నాల్గవ జిల్లాస్థాయి మహాసభ నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషా, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, విజయ్, వీరప్రతాప్, క్రాంతి కుమార్, వెంకటేష్, కలీం, వీరేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో ప్రగతిశీల ఆదర్శ గ్రామ పంచాయతీయ కార్మికుల జిల్లా మహాసభను ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త గా రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ. 26వేలు అం దజేసి సహజ మ రణానికి రూ.5లక్ష ల బీమా సదుపాయం ఇవ్వాలన్నారు. మహాసభ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ జెండాను ఎగురవేశారు. న్యాయవాది మధుసూదన్‌బాబు, టీపీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ శంకర ప్రభాకర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య ఉన్నారు.

కాశీ విశ్వేశ్వరుడి సన్నిధిలో గర్భస్థవాసం

- దీక్షలో ఉన్న విశ్రాంత ఉపాధ్యాయులు



కాశీలో దీక్షలో ఉన్న ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విశ్రాంత డీఈవో విజయ్‌కుమార్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వారణాసిలోని కాశీ విశ్వేశ్వరుడి సన్నిధిలో మహబూబ్‌నగర్ నగరానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు అల్లంపల్లి నరసింహ గుప్తా, ఆయన సతీమణి ఎం.రమాదేవిలు గర్భస్థవాస దీక్ష (9నెలల 9 రోజులు) చేస్తున్నారు. వారు అక్కడి తారకరామ ఆశ్రమంలో ఈ దీక్షను చేపడ్తున్నారు. సోమవారం వారిని కాశీలో విశ్రాంత జిల్లా విద్యా శాఖ అధికారి పి.విజయ్‌కుమార్ కలిసి వారిని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ తర్వాత కాశీనాథుడి సేవలో గడపడం సంతోషకరమన్నారు. ఈ దీక్షలతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దీక్షలో ఉన్న నరసింహగుప్తా మాట్లాడుతూ 9 నెలల 9 రోజుల పాటు మా మాతృమూర్తితో పాటు ఈ దీక్షలో ఉంటామన్నారు. గీతా జయంతి సందర్భంగా 100 గీతా పుస్తకాలను ఆశ్రమంలో వితరణ చేశామన్నారు. నిత్యం గీతా పారాయణంతో గంగానదిలో ప్రతిరోజు పుణ్యస్నానాలు ఆచరించి ఆ కాశీనాథుడిని దర్శించుకుంటామన్నారు. నగరానికి చేరుకున్న అనంతరం కాశీ యాత్ర సత్ఫలితాలు నగర ప్రజలకు వివరిస్తామన్నారు.

పట్నంలో 'పంచాయతీ'



(5వ పేజీ తరువాయి)

దావత్‌లకు పేమెంట్లు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా చేసేస్తున్నారు.

రానుపోను ఖర్చులు.. వాహనాలు..

మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో అభ్యర్థులు హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్ల వద్దకు తమ మద్దతుదారులు, కుటుంబ సభ్యులను పంపించి రానుపోను ఖర్చులు ఇచ్చి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఒకేచోట ఎక్కువ మంది ఉంటే నేరుగా వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు.

● జడ్చర్ల మండలంలోని అభ్యర్థులు వలస ఓటర్లకు దారి ఖర్చులతోపాటు తాయిళాలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

● భూత్పూరు మండలంలో 19 పంచాయతీల్లో 18 జీపీల్లో హోరాహోరీగా పోటీ జరుగుతోంది. పనికోసం, ఉద్యోగం కోసం, చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికి ఫోన్ పే ద్వారా దారి ఖర్చులతోపాటు కొంత అదనంగా డబ్బులు వేస్తున్నారు. హైదరాబాద్ నుంచి రావడానికి ఒక్కో ఓటరుకు రూ.500 నుంచి రూ.1,500 వరకు పంపుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి రావడానికి రూ.2,500 నుంచి రూ.4,000 వరకు ఇస్తున్నారు.

● మల్దకల్ మండలంలో అభ్యర్థులకు ఇటీవల జాతర జరగడం కలిసొచ్చింది. అక్కడికి వచ్చిన వారిని కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. జాతరకు రానివారికి ఫోన్లు చేస్తున్నారు.

● కొల్లాపూర్ నియోజకవర్గంలో ఓటుకు నోటుతోపాటు వాహన సదుపాయం కల్పిస్తున్నారు. కులాలవారీగా పెద్దలను సంప్రదిస్తూ వలస ఓటర్ల దగ్గరకు పంపుతున్నారు.

● ఊర్కొండ మండలంలో వలస ఓటర్లకు రూ.2,000 నుంచి రూ.3,000 వరకు ఆన్‌లైన్ పేమెంట్ చేస్తున్నారు. హన్వాడ మండలంలో పుణె, ముంబై, హైదరాబాద్‌కు తమ అనుచరులను పంపించి.. అడ్వాన్సుగా ఓటర్లకు డబ్బులు ఇచ్చి వస్తున్నారు. ఎల్లంబాయ్, నాగంబాయ్, అయోధ్యనగర్, షేక్‌పల్లి తండా అభ్యర్థులు ఆయా ప్రాంతాల్లో ఓటర్ల కోసం తాయిళాలు ఇస్తున్నారు.

● అచ్చంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో హైదరాబాద్, గుంటూరు, మిర్యాలగూడలో ఉన్న ఓటర్ల వద్దకు అనుచరులను పంపి, ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తామని డబ్బులు ఇచ్చి వస్తున్నారు.

● మాగనూర్ మండలంలో వలస ఓటర్లు వస్తే ఉండటానికి ప్రత్యేక రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో గ్రామం నుంచి ఇద్దరిని వలస ఓటర్ల ప్రాంతాలకు పంపి తీసుకువస్తున్నారు.

● మరికల్ మండలంలో ఆదివారం ముంబై, పూణెకు అభ్యర్థుల అనుచరులు బయల్దేరగా.. హైదరాబాద్‌కు సోమవారం ఉదయం బయల్దేరారు. 14వ తేదీ వరకు అక్కడే తిరిగి ఓటర్లను పోలింగ్‌కు తేనున్నారు.

● కోస్గి మండలం ముసిరిప్ప, బీసీ తండా, ముంగిమల్ల, మీర్జాపూర్, సబ్జాఖాన్‌పేట్, తోగాపూర్, మద్దూరు మండలం నాగిరెడ్డిపల్లి, దంగానపూర్ గ్రామాల వలస ఓటర్లను రప్పించడానికి తరలి వెళ్లారు.

కిక్‌బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కిక్‌బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా బాలికలు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 6,7 తేదీల్లో జరిగిన అస్మిత-ఖేలో ఇండియా జోనల్ సెలక్షన్‌లో కిక్‌బాక్సింగ్‌లో మహబూబ్‌నగర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 12 మంది బాలికలు ఎంపికల్లో పాల్గొనగా ప్రతిభ చాటిన జోనల్‌కి అర్హత సాధించినట్లు జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ సోమవారం తెలిపారు. శ్రియ, సాయిసుజనా, నవ్య, వివేకా వినూత్న, తన్షిత, అప్రాపాతిమా, లక్ష్మీప్రియ అర్హత సాధించి పతకాలు పొందినట్లు తెలిపారు. రవికుమార్ బాలికలను, మేనేజర్ జయదీప్‌ను అభినందించారు.

ఆలిండియా సౌత్‌జోన్ పోటీలకు పయనం



అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్‌తో వాలీబాల్ క్రీడాకారులు

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ వాలీబాల్ పురుషుల జట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలో పాల్గొనేందుకు సోమవారం వాలీబాల్ పురుషుల జట్టు కాకినాడ బయలుదేరారు. ఈ పోటీలు ఈ నెల 10 నుంచి వచ్చే నెల 14 వరకు జరుగుతాయని క్రీడాకారులు మంచి ప్రతిభ కనపరిచి యూనివర్సిటీకి విజయం అందించాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ట్రాక్‌సూట్, టీమ్ యూనిఫామ్ అందజేశారు. అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, పీయూ పీడీ శ్రీనివాసులు, కోచ్‌లు నాన్‌టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



అలేఖ్యను సన్మానిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్కూల్‌గేమ్స్ 69వ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అలేఖ్యను సోమవారం మంత్రి వాకిటి శ్రీహరి తన నివాస గృహం వద్ద సన్మానించి అభినందించారు. క్రీడల్లో సత్తా చాటేవారిని ప్రోత్సహిస్తానని, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి మక్తల్ ప్రాంతానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థిని డిసెంబరు 14 నుంచి 16వరకు ఉత్తరప్రదేశ్‌లో జరుగు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుంద ని లక్ష్య కోచ్ జగదీశ్ తెలిపారు. ఈ సందర్భంగా అలేఖ్యను జి ల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

అత్యపత్య పోటీలకు...



వెల్దండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మోడల్‌స్కూల్ విద్యార్థిని చంద్రకళ జాతీయస్థాయి అత్యపత్య క్రీడలకు ఎంపికైంది. ఈనెల 3న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన జాతీయస్థాయి సెలక్షన్ పోటీలలో చంద్రకళ ప్రతిభ కనబర్చింది. ఈనెల 12, 14 తేదీలలో చండీఘడ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో చంద్రకళ పాల్గొననున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు.

వ్యాసరచన పోటీలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జీహెచ్‌ఎం వెంకటనర్సయ్య, ఉపాధ్యాయ బృందం

గద్వాల సర్కిల్, డిసెంబర్ 8 (ఆంధ్ర జ్యోతి): హైదరాబాద్‌లోని వారధి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఇటీవల ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలో గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర మాజీ ప్రభుత్వ కార్యదర్శి మోహన్‌కంద పర్యవేక్షణలో 'ప్రపంచ అభివృద్ధి నివేదికలో భారతదేశ స్థానాన్ని మెరుగుపర్చడానికి తీసుకోవాల్సిన చర్యలు' అనే అంశంపై ఆన్ లైన్ వేదిక ద్వారా ఈ పోటీ నిర్వహించారు. పాఠశాలకు చెంది న 9వ తరగతి విద్యార్థినులు తేజస్విని, శ్రీమేఘన, ప్రణీతలు రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచినట్లు పాఠశాల జీహెచ్ ఎం.వెంకటనర్సయ్య, గైడ్ టీచర్ నాగరాజులు సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రోత్సాహక బహుమతి కింద ఒక్కో విద్యార్థినికి రూ.5 వేలు, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు వివరించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ప్రోత్సహించిన గైడ్ టీచర్ నాగరాజును జీహెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫిల్టర్ ఇసుక.. నాణ్యతకు మస్కా!

- ఎన్నికల సందడిలో అధికారులు
- జోరుగా ఇసుక అక్రమ రవాణా



అన్నరెడ్డిపల్లి వాగు సమీపంలో ఉన్న ఫిల్టర్ ఇసుక స్థావరం

మహమ్మదాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి పేరుతో ఇసుక అక్రమ రవాణా చేసేందుకు మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలాన్ని అడ్డాగా చేసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు నాణ్యమైన ఇసుక పంపిణీ చేయాలని ప్రభుత్వం చెబుతున్నా మండల వ్యాప్తంగా అంతా ఫిల్టర్ ఇసుక పంపిణీ చేసి నాణ్యతకు మస్కా కొడుతున్నారు. దీనికి తోడు అధికారులు ఇందిరమ్మ ఇంటికోసం పది ట్రాక్టర్ల ట్రిప్పులకు అనుమతి ఇస్తే అదే అదునుగా రోజూ వంద ట్రిప్పుల ఇసుక తరలిస్తుండటం గమనార్హం.

మహమ్మదాబాద్ మండలం ఇసుక అక్రమ రవాణాకు కేంద్రంగా మారింది. పట్టపగలు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందునుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా ఎలాంటి నెంబరు ప్లేట్‌లేని ఇసుక ట్రాక్టర్లు దర్జాగా తిరుగుతున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఆదివారం మండలంలో కేంద్రంలోని అన్నరెడ్డిపల్లి వాగు, కంచిపల్లి శివారు ప్రాంతాల సమీపం నుంచి ఫిల్టర్ ఇసుక స్థావరాలనుంచి ఇసుక తరలిస్తున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలో మొత్తం 20 ట్రాక్టర్లు నిత్యం ఒక్కరోజు నాలుగు నుంచి ఐదు ట్రిప్పుల ఇసుక రవాణా చేస్తున్నాయి. గ్రామపంచాయతీ అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండటంతో ఇసుక రవాణాదారులకు పండగలా మారింది. రాత్రి అయిందంటే చాలు కంచింపల్లి, అన్నరెడ్డిపల్లి వాగుల వద్ద ఏర్పాటు చేసిన ఫిల్టర్ ఇసుక స్థావరాల నుంచి జోరుగా రవాణా అవుతున్నది. వెంకటొరెడ్డిపల్లి, బొమ్మికుంటతండా, సాకిరేవు, రామాలయం సమీపంలో వెలసిన ఇసుక స్థావరాల వైపు అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో నిత్యం ఇసుక రవాణా జోరుగా సాగుతున్నది. గత నెలలో మైనింగ్ అధికారులు ఇసుక డంపులు రెండింటిని తీసివేశారు. మరికొన్ని చోట్ల అలాగే ఫిల్టర్ స్థావరాలు ఉండిపోయాయి. అక్కడి నుంచి ఇసుక అక్రమ రవాణామాత్రం జోరుగా సాగుతుంది.

అతివలకు అండగా షీటీం

- మూడేళ్లలో 190 మందిపై కేసులు



కొల్లంపల్లి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన షీటీం సభ్యులు

కోస్గిరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా, ఫిర్యాదు అందితే చాలు షీటీం రంగంలోకి దిగి ఆకతాయిల భరతం పడుతోంది. మూడేళ్ల కాలంలో 179 ఫిర్యాదులు నమోదయ్యాయి. 91 పిటీ కేసులు, 8 ఎఫ్‌ఐఆర్ కేసుల్లో 190 మందిపై షీటీం పోలీసులు కేసులు నమోదు చేశారు.

● **రద్దీ ప్రాంతాల్లో పర్యవేక్షణ**

జిల్లాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీటీం సిబ్బంది పాఠశాలలు, కళాశాలలు, బస్టాండులు, రద్దీ ప్రాంతాల్లో దృష్టి సారిస్తున్నారు. బాధితుల ఫిర్యాదుల ద్వారా ఆయా పరిసర ప్రాంతాల్లో గస్తీ నిర్వహించి చర్యలు తీసుకుంటున్నారు. తీవ్రత త క్కువగా ఉన్నట్లు భావిస్తే వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి మందలిస్తున్నారు. పునరావృతం చేస్తే కేసు నమోదు చేస్తామంటూ హెచ్చరిస్తున్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థినులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

● **వేధింపులకు గురిచేస్తే కేసులు**

మహిళలు, విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు అం దితే తక్షణమే స్పందించి షీటీం సభ్యుల ద్వారా విచారణ చేయిస్తాం. వే ధింపులకు గురిచేస్తున్నవారిని అదు పులోకి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహి స్తారు. సమస్య తీవ్రతను బట్టి చర్య లుంటాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో షీటీం నిరంతర నిఘా కొనసా గుతుంది. రెండేళ్లకాలంలో 292 అవ గాహన కార్యక్రమాలు నిర్వహించాం.

- డాక్టర్ వినీత్, ఎస్పీ, నారాయణ పేట జిల్లా

రెబల్ అభ్యర్థులతో మంతనాలు

» కిటకిటలాడిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం



అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభ్యర్థులు

అచ్చంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అధికార పార్టీ మద్దతుతో పోటీ చేసేందుకు ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేశారు. రెబల్ అభ్యర్థులను పోటీలో నుంచి తప్పించేందుకు క్యాంపు కార్యాలయంలో చర్చలు జరుపుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నామినేషన్ వేసిన అభ్యర్థులతో కిటకిటలాడింది. మూడో విడత పంచాయతీ ఎన్నికలు జరిగే నియోజకవర్గంలోని 7 మండలాల్లో 158 గ్రామ పంచాయతీల్లో సర్పంచు స్థానాలకు 547 మంది పోటీలో ఉన్నారు. 364 వార్డులకు 1,534 మంది నామినేషన్లు వేశారు. ఈ నేపథ్యంలో ప్రధానంగా అధికార పార్టీలోనే పోటీ ఎక్కువగా ఉంది. పోటీలో ఒక్కరే ఉంటే గెలుపు సులభమవుతుందని గ్రామాల్లోని కార్యకర్తలు అధిష్ఠానానికి ఫిర్యాదులు చేస్తుండడంతో రెబల్ అభ్యర్థులను క్యాంపు కార్యాలయానికి పిలిచి బుజ్జగిస్తున్నారు. నామినేషన్ ఉపసంహరించుకొని పోటీ నుంచి తప్పుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

జమ్మాపూర్ సర్పంచ్ పదవి ఏకగ్రీవం

పాన్‌గల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండల పరిధిలోని జమ్మాపూర్ గ్రామ సర్పంచ్‌గా కురువ మల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన అధికార పార్టీ మద్దతుతో నామినేషన్ వేశారు. ఆయనతో పాటు తిరుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలు, బీఆర్‌ఎస్ నుంచి వెంకట్, బీజేపీ నుంచి కిశోర్‌కుమార్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. మిగిలిన వారందరూ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అంగీకరించడంతో మల్లయ్య ఒక్కరే బరిలో మిగిలారు. గ్రామంలో ఆంజనేయస్వామి గుడి మరమ్మతు, రామాలయం, శివాలయాల నిర్మాణానికి రూ. 35 లక్షలు విరాళంగా ఇస్తానని చెప్పడంతో ఏకగ్రీవం కుదిరినట్లు సమాచారం. అలాగే మొత్తం 10 వార్డులలో బీఆర్‌ఎస్‌కు 6, కాంగ్రెస్‌కు 4 స్థానాలు కేటాయిస్తూ తీర్మానించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎంపీడీవో గోవిందరావును వివరణ కోరగా ఆర్‌వో నుంచి అధికారికంగా సమాచారం రాలేదన్నారు.

'నోటా'కు ఎక్కువ ఓట్లు వస్తే?



మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరు నచ్చకపోతే ఓటర్లు నోటాకు ఓటు వేసే అవకాశాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కల్పించింది. అయితే బరిలో నిలిచిన అభ్యర్థుల కన్నా నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చినా ఎన్నిక రద్దయ్యే అవకాశం మాత్రం లేదు. ఎన్నికల నిబంధనల మేరకు రెండో స్థానంలో ఉన్న అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. నోటాకు అధికంగా ఓట్లు పోలైనప్పుడు ఆ ఎన్నికను రద్దు చేసి, మళ్లీ పోలింగ్ నిర్వహించాలని గతంలో సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. నోటా కన్నా తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఐదేళ్ల పాటు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా చూసేలా నిబంధనలను రూపొందించాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఈ విషయంపై అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. కానీ ఈ అంశంపై ఎన్నికల సంఘం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. పీపుల్స్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంతో 2013లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఈవీఎంలలో నోటా మీటను ఏర్పాటు చేశారు. ఈ సారి గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ నోటాకు ఓటు వేసే అవకాశం కల్పించారు.

పక్కాగా లెక్కలు చెప్పకపోతే చిక్కులు



» ఎన్నికల ఖర్చులను సక్రమంగా నమోదు చేయాలి

» 45 రోజుల్లోగా ఎంపీడీవోలకు అందించాలి

» గెలిచినా, ఓడినా అభ్యర్థులపై తప్పని చర్యలు

» ఎన్నికల్లో పోటీకి 3 ఏళ్ల పాటు అనర్హత




మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచు, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు తాము ఖర్చు వివరాలను పూర్తిగా, పక్కాగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ వివరాలను ఎన్నికల అనంతరం 45 రోజుల్లోగా ఎంపీడీవోలకు అందించాల్సి ఉంటుంది. గెలిచినా, ఓడిపోయినా ఈ వివరాలను సమర్పించడం తప్పనిసరి. ఖర్చుల వివరాలను సమర్పించకపోతే, సదరు అభ్యర్థి గెలిచినా, ఓడినా రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటారు. గెలిచిన అభ్యర్థులపై అనర్హత, ఇతర చర్యలు తీసుకునేందుకు ఎంపీడీవోల సిపార్సు మేరకు డీపీవో కలెక్టర్‌కు నివేదిక పంపుతారు. వారి నుంచి వచ్చిన వివరణ మేరకు కలెక్టర్ చర్యలు తీసుకుంటారు. అలాగే ఓడిపోయిన సర్పంచు, వార్డు మెంబర్లు ఏ ఇతర ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా వారిపై అనర్హత వేటు వేయనున్నారు.

జనాభాను బట్టి ఎన్నికల ఖర్చు

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచు, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఎంత ఖర్చు చేయవచ్చో ఎన్నికల వ్యయ పరిశీలకులు నిర్ణయిస్తారు. జనాభా 5 వేల కంటే ఎక్కువగా ఉన్న గ్రామ పంచాయతీలలో సర్పంచు అభ్యర్థి రూ 2.50 లక్షల వరకు ఖర్చు చేసే అవకాశం ఉంటుంది. వార్డు సభ్యుడి స్థానానికి రూ. 50 వేలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. చిన్న గ్రామ పంచాయతీల్లో సర్పంచు అభ్యర్థికి రూ. 1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ. 30 వేలు ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుంది. అభ్యర్థులు తాము చేస్తున్న ఖర్చులను రోజు వారీగా నమోదు చేయాల్సి ఉంటుంది. దేనికి ఎంత ఖర్చు చేశారో పక్కాగా రాయాల్సి ఉంటుంది. ఎన్నికల అనంతరం ఈ వివరాలను సంబధిత ఎంపిడీవోలకు 45 రోజుల్లోగా అందించాల్సి ఉంటుంది. లేకపోతే అధికారులు చర్యలు తీసుకుంటారు.

2019లో 500 మందిపై అనర్హత

నారాయణపేట, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు, 2019లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అనంతరం 2019, ఫిబ్రవరి 17లో అప్పటి సీఎం కేసీఆర్ తన జన్మదినం సంబర్భంగా నారాయణపేట జిల్లాను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు మొత్తం 721 గ్రామాలకు గాను బండమీదిపల్లి, శంకరాయిపల్లి గ్రామాలకు ఎన్నికలు నిర్వహించలేదు. 719 గ్రామాలకు, 6,825 వార్డు సభ్యులకు ఎన్నికలు జరిగాయి. అందులో 500 మంది వార్డు సభ్యులు, 25 మంది సర్పంచులు ఎన్నికల ఖర్చు వివరాలను సమర్పించలేదు. దీంతో వారు 3 ఏళ్ల పాటు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా అనర్హత వేటు వేశారు. ఈ సారి ఎన్నికల్లో ఎంత మంది అభ్యర్థులు ఎన్నికల ఖర్చు వివరాలను అందించారో ఎన్నికల అనంతరం తెలుస్తుంది.



సర్కార్ కొలువు వదిలి.. సర్పంచు పదవికి పోటీ..



నారనోళ్ల నారాయణ

దామరగిద్ద, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి పోటీ చేసేందుకు ఓ వ్యక్తి తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశారు. నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలంలోని కానుకుర్తి గ్రామానికి చెందిన నారనోళ్ల నారాయణ 1992లో సింగిల్ విండో ఛైర్మన్‌గా పని చేశారు. అనంతరం 2002లో వీఆర్‌వోగా నియమితులయ్యారు. 2022లో తాండూరు ఐటీఐలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికలు రావడంతో, ఇంకా 13 నెలల సర్వీసు మిగిలి ఉండగానే ఉద్యోగానికి రాజీనామా చేశా రు. గ్రామ సర్పంచి బరిలో నిలిచారు.

తాను పుట్టిన గ్రామం అభివృద్ధి కోసం తాను వీఆర్‌ఎస్ తీసుకొని పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి అండతో, కాంగ్రెస్ మద్దతుదారుగా ఎన్నికల బరిలో నిలిచినట్లు చెప్పారు.

రూ. 90 వేలు స్వాధీనం

» కృష్ణ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలు

కృష్ణ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. మక్తల్‌కు చెందిన సోంపల్లి వెంకట్‌నాయుడు అనే వ్యక్తి సోమవారం కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా కేంద్రం నుంచి షిఫ్ట్ కారులో వస్తుండగా, రాష్ట్రం సరిహద్దులోని కృష్ణ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. కారులో రూ.90 వేలు లభ్యం కావడంతో విచారించారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నవీద్ అన్నారు. ఆ నగదును తహసీల్దార్ శ్రీనివాస్‌కు అప్పగించినట్లు తెలిపారు.

జాతరలో ప్రచారం

» అభ్యర్థులకు కలిసి వచ్చిన అవకాశం

» మల్దకల్ బ్రహ్మోత్సవాల్లో అభ్యర్థుల జోరు

మల్దకల్, డిశంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు మల్దకల్ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కలిసి వచ్చాయి. ఈ మండలంలో రెండో విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. మండల పరిధిలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా, 5 గ్రామాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 20 గ్రామాల్లో సర్పంచు స్థానాలకు 75 మంది బరిలో నిలిచారు. 242 వార్డులకు 54 ఏకగ్రీవం కాగా, మిగిలిన 188 వార్డు స్థానాలకు 486 మంది సభ్యులు పోటీలో ఉన్నారు. గుర్తుల కేటాయింపు పూర్తి కావడంతో వారంతా ముమ్మర ప్రచారం కొనసాగిస్తున్నారు. సరిగ్గా ఇదే సమయంలో మల్దకల్ జాతర కొనసాగుతున్నది.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి

జాతరకు వచ్చిన వలస ఓటర్లు

మల్దకల్ మండల కేంద్రంలో గతనెల 25 వ తేదీ నుండి స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మండలంలోని గ్రామాలకు చెందిన వారు వృత్తి, ఉద్యోగం, ఉన్నత చదువుల కోసం ఎక్కడ ఉంటున్నా, జాతరలో పాల్గొనేందుకు స్వగ్రామాలకు చేరుకొని మొక్కుబడులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఈ సారి కూడా వారందరూ స్వగ్రామాలకు చేరుకున్నారు.

ఈ అంశం అభ్యర్థులకు కలిసివచ్చింది. ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్లను కలిసి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. పరిస్థితుల కారణంగా జాతరకు రాని ఓటర్ల ఫోన్ నెంబర్లను సేకరిస్తున్నారు. వారికి ఫోన్లు చేసి ఎన్నికల నాటికి రావాలని కోరుతున్నారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్తున్నారు. ఇప్పుడు జాతర లేకపోయి ఉంటే అభ్యర్థులే స్వయంగా, లేదా వారి మద్దతుదారులు పట్టణాలకు వెళ్లి ఓటర్లను కలిసి రావాల్సి వచ్చేంది. ఈ సారి వారికి ఆ శ్రమ తప్పింది. వలస ఓటర్లే గ్రామాలకు చేరుకోవడంతో ప్రచారం సులువు అయ్యింది.

ప్రజాప్రతినిధుల విస్తృత ప్రచారం

» మద్దతుదారులను గెలిపించుకునేందుకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల ప్రచారం

» మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రం మంతనాలకే పరిమితం

మహబూబ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడత పంచాయతీ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. పోలింగ్‌కు మూడు రోజులు గడువు ఉండటంతో ఆయా పార్టీల ముఖ్య నాయకులు అంతా పల్లె పోరుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికలు జరిగే పంచాయతీల్లో తమ పార్టీకి చెందిన వారిని గెలిపించుకునేందుకు రంగంలోకి దిగారు. ఇందులో ప్రధానంగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రచారం ముమ్మరం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది. మూడు రోజులుగా కాంగ్రెస్ పార్టీ తరఫున వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల మద్దతు కోరుతున్నారు. గ్రామాలలో కార్నర్ మీటింగులు ఏర్పాటు చేసి వీడియో సందేశాన్ని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఎమ్మెల్యే మేఘారెడ్డి రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చిన హామీలపై ప్రచారం నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల మద్దతు కూడగడుతున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి వెల్దండ మండలంలోని పలు గ్రామాల్లో తమ పార్టీ బలపరిచిన అభ్యర్థుల కోసం ప్రచారం నిర్వహించారు. వెల్దండ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ ఉమ్మడి అభ్యర్థికి మద్దతుగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రచారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తమ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా తెలకపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తాడూరు మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల కోసం పలు గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు.

నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలో లక్కాయపల్లి, నందిపాడ్, పల్లెర్ల పంచాయతీ ఎన్నికల ప్రచారంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ మద్దత్తుదారులను గెలిపించాలని కోరారు. జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కూడా తమ అభ్యర్థులకు మద్దతుగా విస్తృతంగా పర్యటిస్తున్నారు. పాలమూరు జిల్లాలో మాత్రం ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్నికల ప్రచారంలో కనిపిం చడం లేదు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధు సూదన్‌రెడ్డి మాత్రం ఒకరోజు తన సొంత మండలంలోని మూడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

జిల్లాలోని మూడు నియోజకవర్గాలైన మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్లలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు గ్రామాలలో తిరిగి ప్రచారం నిర్వహించడం లేదు. ఇళ్ల వద్దనే అభ్యర్థులతో సంప్రదింపులు, రెబల్స్‌ను బుజ్జగించడం, పార్టీలో చేర్చుకోవడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు కూడా ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. పలు మండలాలలో ద్వితీయశ్రేణి నాయకులు గ్రామాల్లో తిరుగుతూ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

సర్పంచ్‌కు ఓట్లు... పొలాలకు తీరిన దారి పాట్లు

» ఎన్నికలు ముగియకముందే దీర్ఘకాల సమస్య పరిష్కారం

మహబూబ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లగా తీరని సమస్య పంచాయతీ ఎన్నికలతో పరిష్కారం అయ్యింది. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని ఓ గ్రామంలో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థికి సంబంధించిన వ్యవసాయ భూమి ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్నది. ఆ భూమి వెనుక ఉన్న రైతులు తమ పొలాలకు దారి లేదని, అందరం కలిసి కొంత భూమిని వదులుకొని రోడ్డు వేద్దామన్నా, ముందున్న రైతు వదలకపోవడం సమస్యగా మారింది. సర్పంచ్ ఎన్నికల పుణ్యమా వెతుకుతున్న తీగ కాలికి తగిలినట్లు అతడే బరిలో నిలవడంతో వెనుక ఉన్న రైతులు దారి వదలాలన్న ప్రతిపాదన తీసుకువచ్చారు. ఆ రైతులకు సంబంధించి దాదాపు 50 కుటుంబాలకు చెందిన 150 వరకు ఓట్లు ఉండగా ఆ ఓట్లన్నీ మీకే గంపగుత్తగా వేస్తామని మాటివ్వడంతో ఆ రైతు దారి వదిలేందుకు సుముఖత వ్యక్తం చేశారు. మాట ఇచ్చిందే తడవుగా దారి వేసుకుంటూ వస్తున్నారు. మరో రెండ్రోజుల్లో మట్టి రోడ్డు వేయడం పూర్తికానుంది. దీంతో సర్పంచ్ అభ్యర్థికి ఓట్లు, తమ పొలాలకు తీరిన దారి పాట్లు అన్న చర్చ సాగుతోంది.



పొలాలకు ఏర్పాటు చేసిన మట్టిరోడ్డు

క్రైం కార్నర్

బావిలో పడి వ్యక్తి మృతి

తెలకపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని చిన్న ముద్దునూరుకు చెందిన గుండాల బాలకిష్టి (51) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ పి.నరేశ్ తెలిపారు. బాలకిష్టి రాత్రి వేళ స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో పడుకొని ఉదయమే ఇంటికి వచ్చేవాడు. అలాగే ఆదివారం రాత్రి 8 గంటలకు బయటకు వెళ్లిన ఆయన సోమవారం ఉదయం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆలయం వద్ద చూడగా కనిపించలేదు. అనుమానం వచ్చి సమీపంలోని బావిలో చూడగా, అతడి మృతదేహం కనిపించింది. చీకట్లో కనిపించక ప్రమాదవశత్తు బావిలో పడి ఉండొచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటనపై అతడి భార్య తిరుతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ, మోపెడ్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

దేవరకద్ర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మోపెడ్, లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర ఎస్‌ఐ నాగన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌకుంట్లకు చెందిన బాల్‌రాజు (35) సోమవారం మధ్యాహ్నం మోపెడ్‌పై దేవరకద్రకు వచ్చాడు. సాయంత్రం గ్రామానికి తిరిగి వెళ్తుండగా, డోకూరు స్టేజీకి సమీపంలో కస్తూర్బా పాఠశాల వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

గద్వాల క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనం గంటలోనే చోరీ అయ్యింది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రెండవ రైల్వేగేట్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రవేటు ఉద్యోగి శ్రీనివాస్ సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

పొలంలో యువరైతు కన్నుమూత

బిజినేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న చేనుకు నీళ్ళు పట్టేందుకు వెళ్లిన నవారి కృష్ణ (42) అనే రైతు ఫిట్స్ వచ్చి మృతి చెందాడు. కృష్ణ రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఆదివారం రాత్రి పొలానికి వెళ్లిన ఆయన సోమవారం ఉదయం వరకు ఇంటికి రాలేదు. దీంతో అతడి తండ్రి నవారి చెన్నయ్య పొలానికి వెళ్లి చూడగా కుమారుడు మృతి చెంది కనిపించాడు. చుట్టుపక్క రైతులు చూసి ఫిట్స్‌తో మృతి చెంది ఉండొచ్చని తెలిపారు. అతడికి భార్య నారమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రేషన్ షాపుల్లో పురుగుల బియ్యం

» అచ్చంపేట పట్టణంలోని చౌకధరల దుకాణాల్లో గుర్తింపు

» తహసీల్దార్ సైదులు ఆకస్మిక తనిఖీ

అచ్చంపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చం పేట పట్టణంలోని రేషన్‌దుకాణాల్లో 100 క్వింటాళ్లకు పైగా పురుగులు పట్టిన బియ్యం నిల్వ ఉన్నట్లు తహసీల్దార్ సైదులు తెలిపారు. పట్టణంలోని పాత బజార్‌లో ఉన్న 4 రేషన్ దుకాణాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వ ఉన్న బియ్యంతో పాటు, రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా డబ్బు చెల్లిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై విచారణ నిర్వహించి, వాస్తవమని తేలితే కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులు బియ్యాన్ని విక్రయిస్తే రేషన్‌కార్డులను రద్దు చేస్తామని హెచ్చరించారు. పురుగులు పట్టిన రేషన్ బియ్యం విషయంపై సివిల్ సప్లై అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఆ బియ్యాన్ని వెనక్కి పంపించి, లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీలర్లను హెచ్చరించారు.



రేషన్ డీలర్‌తో మాట్లాడి వివరాలను తెలుసుకుంటున్న తహసీల్దార్ సైదులు

ఎక్కువ కేసులు పరిష్కరించాలి

» జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. ప్రేమలత

గద్వాల క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జోగుళాంబ గద్వాల జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. ప్రేమలత అన్నారు. ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి పోలీసు అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కక్షిదారులు పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగకుండా ఇరువర్గాలను సమన్వయపరిచి కేసుల రాజీపై అవగాహన కల్పించాలన్నారు. కోర్టుల చుట్టూ తిరిగి డబ్బు, సమయం వృథా చేసుకోకుండా రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ సీనియర్ సవిల్ న్యాయాధికారి టి.లక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎన్‌వీహెచ్ పూజిత, జూనియర్ సివిల్ న్యాయాధికారి డి.ఉదయ్‌నాయక్, ఏపీపీలు రేచల్ సంజన జాషువా, భవానీ, అదనపు ఎస్పీ కె.శంకర్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి ప్రేమలత

ప్రత్యర్థులు అవమానించారని యువకుడి ఆత్మహత్యాయత్నం



గద్వాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంజి

గట్టు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సర్పంచుగా పోటీ చేస్తున్న తన తల్లిని ప్రత్యర్థులు హేళనగా మాట్లాడి అవమానించారంటూ మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండల పరిధిలోని యల్లందొడ్డిలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఎ.జయసుధ నడిగడ్డ హక్కుల పోరాట సమితి (ఎన్‌హెచ్‌పీఎస్) మద్దతుతో సర్పంచుగా పోటీ చేస్తోంది. ఈ విషయంపై ప్రత్యర్థులు కొందరు హేళన చేసి, అవమానకరంగా మాట్లాడటంతో ఆమె కుమారుడు అంజి మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని గట్టు ఎస్‌ఐ కేటీ మల్లేశ్ తెలిపారు.

ఫోన్‌పే ద్వారా డబ్బు స్వాహా

జడ్చర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొబైల్‌ఫోన్ చోరీ చేసి, ఫోన్‌పే ద్వారా డబ్బు డ్రా చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లలో జరిగింది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... కావేరమ్మపేటకు చెందిన మునీర్ అనే వ్యక్తి హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఈ నెల 3న జడ్చర్ల కొత్త బస్టాండుకు వెళ్లాడు. సీట్ విషయంపై బస్ కండక్టర్‌తో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తి మొబైల్ ఫోన్‌ను చోరీ చేశాడు. అందులోని ఫోన్‌పే యాప్ ద్వారా మూడు విడతలుగా రూ.11,854 తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

పశు వైద్యాధికారిని నియమించాలి



వడ్డేపల్లి మండల పశు వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

వడ్డేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జూలేకల్ గ్రామంలోని పశువైద్యశాలలో వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని గ్రామస్థులు కోరారు. ఈమేరకు సోమవారం వడ్డేపల్లి మండల పశు వైద్యాధికారి స్వరూపరాణిని కలిసి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. వైద్యుడు లేనందున అనారోగ్యానికి గురైన జీవాలకు సరైన సమయంలో చికిత్స అందక చనిపోతున్నాయన్నాయని తెలిపారు. వెంటనే డాక్టర్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటింటికీ భగవద్గీత



మహిళకు భగవద్గీత పుస్తకం ఇస్తున్న బచ్చు లక్ష్మీనారాయణ

రాజోలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతను పెంచడమే లక్ష్యంగా భగవద్గీత పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజోలి గ్రామానికి చెందిన బచ్చు లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఆయన రాజోలిలోని పలు ఇళ్లకు తిరిగి భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు.

రేషన్ బ్యాగులపై ఫొటోలతో కాంగ్రెస్ ప్రచారం



రేషన్ బ్యాగును చూపుతున్న బీజేపీ నాయకులు

అయిజ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్‌పై రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి విమర్శించారు. సోమవారం పట్టణంలోని రేషన్ దుకాణాలను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు ముద్రించిన బ్యాగులను లబ్ధిదారులకు అందించి ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. మోదీ సంక్షేమ పథకాలకు పేరు మార్చి చెప్పుకోవటం సరికాదన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌గౌడు, నాగరాజు, లక్ష్మణా చారి, కృష్ణ, ఖుషి పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

● కలెక్టర్ బీఎం సంతోష్

● ధరూరు, కేటీదొడ్డిలో పోలింగ్ కేంద్రాల పరిశీలన



ధరూర్ ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

ధరూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు తమ సొంత మండలాల్లో ఓటు హక్కును వినియోగించుకునేదుకు నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రిను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా సజావుగా నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ధరూర్, కేటీదొడ్డి మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ పోస్టల్ బ్యాలెట్‌కు ఆయా మండాలలకు చెందిన ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారని, వారికిచ్చిన ఫామ్-14లో వివరాలను పరిశీలించారు. హెల్ప్ డెస్క్ సిబ్బందితో మాట్లాడి పలుసూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకుని వినియోగించుకోని వారి వివనరాలను, ఎంతమంది వినియోగించుకున్నారో వివరాలను నమోదు చేయాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీల ఓటరు జాబితాలో పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు వచ్చిన వారి వివరాలు సరి చూసుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌కు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీలు వేశారా అని అధికారులను అడిగారు. పోస్టల్ బ్యాలెట్ విధులు నిర్వహించే సిబ్బంది పనితీరును దగ్గరుండి పరిశీలించారు. ఆయా గ్రామ పంచాయతీల వారీగా బ్యాలెట్ పేపర్లలో వార్డు సభ్యుల, సర్పంచు అభ్యర్థుల వివరాలను చూశారు. పోస్టల్ బ్యాలెట్స్ ప్రక్రియ పూర్తయ్యాక ఆయా గ్రామ పంచాయతీల వారీగా వచ్చిన పోస్టల్ బ్యాలెట్స్‌ను సంబంధిత ప్రిసైడింగ్ అధికారులకు అప్పగించాలన్నారు. అనంతరం కేటీదొడ్డి మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో గ్రామ పంచాయతీ ఎన్నిలకు సబందించిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ పేపర్స్ ముద్రణలో తప్పులు లేకుండా చూసుకోవాలని అక్కడి అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్స్‌లు, వివిధ పోలింగ్ ఫామ్స్, తదితర సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి జిల్లా మానిటరింగ్ అధికారి శ్రీనివాసులు, ఆయా మండలాల ఎంపీడీవోలు కృష్ణమోహన్, రమణారావు, తహసీల్దార్‌లు నరేందర్, హరికృష్ణ ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఈవీఎంలు(ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్) భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ బీఎం సంతోష్ సోమవారం సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేసారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలో భాగంగానే ఈ తనిఖీ నిర్వహించారు. గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌తో పాటు భద్రత నిర్వహణను పరిశీలించారు. ఈసందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అలాగే సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

పోలింగ్ సిబ్బంది కేటాయింపు ప్రక్రియ పూర్తి

మూడో విడత పోలింగ్ సిబ్బంది కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం ఐడీవోసీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల సాధారణ పరిశీలకులు గంగాధర్‌తో కలిసి మూడో విడత పోలింగ్ సిబ్బందికి రెండో ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఇటిక్యాల, ఎర్రవల్లి, అలంపూర్, మానోపాడు, ఉండవల్లి మండలాల్లో రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు మొత్తం 700 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పీవోలు 700, ఏపీవోలు 859, సిబ్బంది మొత్తం 1,559 మందిని రెండవ ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో డీపీవో శ్రీకాంత్, ఈడీఎం శివ, సిబ్బంది ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి

● జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత

- గద్వాలలో ఎస్సీ బాలికల వసతి గృహం తనిఖీ

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో వసతి గృహ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు అందుతున్న భోజనం, వంటగది పరిస్థితులు, బాత్‌రూమ్‌లు, వసతిగృహపరిసరాల శుభ్రతను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెల మెడికల్ క్యాంపు నిర్వహించి, విద్యార్థినులకు అవసరమైన మందులు అందించాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి హాస్టల్ వసతులు, విద్యార్థినుల చదువు పరిస్థితుల గురించి వారికి తెలియజేయాలన్నారు.

విద్యార్థినులు చదువు మధ్యలో మానుకొని ఊరికి వెళ్లకుండా చూడటం వసతిగృహ అధికారుల బాధ్యతన్నారు. 10వ తరగతి విద్యార్థినుల చదువు గురించి విద్యార్థుల ద్వారా ఆరా తీశారు. ట్యూటర్లు బోధిస్తున్న విధానం, విద్యార్థినుల ప్రగతి గురించి ఆరాతీసి, ఈ విద్యాసంవత్సరంలో అందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం రికార్డులు, వసతిగృహ గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో సుజాత, విద్యార్థులు ఉన్నారు.

ప్రచారం ఖర్చులు తప్పక నమోదు చేయాలి

- జిల్లా ఎక్స్పెండేచర్ అబ్జర్వర్ రాజేష్ బాబు

రాజోలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారం ఖర్చులు తప్పక నమోదు చేయాలని జిల్లా ఎక్స్పెండేచర్ అబ్జర్వర్ రాజేష్‌బాబు అన్నారు. సోమవారం రాజోలిలోని రైతువేదికలో ఎన్నికల ఖర్చు నిర్వహణపై మండలంలోని సర్పంచు, వార్డు మెంబర్లకు పోటీ చూస్తున్న అభ్యర్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదువేల జనాభా ఉన్న మేజర్ గ్రామ పంచాయతీల్లో సర్పంచు అభ్యర్థులు రూ.2.5 లక్షలు, వార్డు మెంబర్లు రూ.50 వేలకు ఎన్నికల ఖర్చు మించకూడ దని, ఐదువేలలోపు జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచు రూ.1.5 లక్షలు, వార్డు మెంబర్లు రూ.30 వేలకు మించి ఖర్చులు చేయకూడదని సూచించారు. ఎన్నికల ప్రచారంలో ఖర్చు చేస్తున్న ప్రతీ రూపాయి లెక్కలు రాసి ఎన్నికల అధికారులకు అప్పగించాలని ఆయన అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో ఎక్స్పెండేచర్ మానిటరింగ్ అధికారి నాగేందర్ రెడ్డి, అసిస్టెంట్ ఎక్స్పెండేచర్ అబ్జర్వర్ రామేశ్వర్, లిజెన్ ఆఫీసర్ అశోక్‌కుమార్, ఖాజామొయినుద్దిన్, మండలంలోని సర్పంచు అభ్యర్థులు, వార్డు మెంబర్లు అభ్యర్థులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి : డీఎంహెచ్‌వో

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వర్తించే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో కిరణ్మయి అన్నారు. మానవపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ప్రతీ కాన్పు ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలని చెప్పారు. ఓపీ సేవలు, ల్యాబ్, ఫార్మసీ సిబ్బంది అందుబాటులో ఉండాలని, 30 ఏళ్ల పైబడిన వారందరికీ ఎన్సీడీ స్ర్కీనింగ్ నిర్వహించి ఆన్లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శరణ్య, కోఆర్డినేటర్ శ్యాంసుందర్, చంద్రన్న, అక్కమ్మ, శేఖర్, శ్రీదేవి, సోని, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : ఎస్పీ

గద్వాల క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో శాంతిభద్రతే లక్ష్యమని, ప్రజలు, అభ్యర్థులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఎలాంటి అశాంతి, ఉద్రిక్తతలు లేకుండా సహకరించాలని కోరారు. రాత్రివేళ గుంపులుగా తిరుగడం, మద్యం తాగి గొడవలకు దిగడం, ఓటర్లను బెదిరించడం, డబ్బు, బహుమతులతో ఓట్లను ప్రభావితం చేయడం చట్టరిత్యానేరమని, సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు, ద్వేషపూరిత వ్యాఖ్యలు, వీడియోలను పంపడం నేరమని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎన్నికల ప్రక్రియలో అనుమానాస్పద కదలికలు, అనుచిత ప్రభావం, బెదిరింపులు గమనించిన వెంటనే డయల్ 100కు, జిల్లా కంట్రోల్ రూమ్ 8712670306కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఓటర్లు ప్రలోభాలకు లొంగవద్దు

● సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

గద్వాల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ధనబలం చూపుతున్న అభ్యర్థుల పట్ల ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని, వారి ప్రలోభాలకు లొంగవద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు కోరారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం అనంతరం ఆంజనేయులు విలేకరులతో మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం పోరాటం సాగిస్తున్న సీపీఐ జిల్లాలోని అనేక గ్రామ పంచాయతీల్లో పోటీకి దిగినట్లు తెలిపారు. ఇప్పటి వరకు అనేకసార్లు ఎన్నికల్లో గెలుపొందిన వారు తమ స్వార్థం తప్ప గ్రామాల అభివృద్ధి, ప్రజల బాగు గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. ఈక్రమంలో నిజమైన ప్రజాప్రతినిధులుగా సేవలందించేందుకు తమపార్టీ చేసిన ప్రయత్నానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో రంగన్న, వెంకటేష్, ప్రవీణ్, నరేష్, భరత్ ఉన్నారు.

తూముకుంట దారిలో కొండచిలువ ప్రత్యక్షం



తూముకుంట రహదారిలో కొండచిలువ

అయిజ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అయిజ సమీపంలోని తూముకుంట రహదారిలో జములమ్మదేవి ఆలయం వెనుక ఉన్న వంకలో సోమవారం రాత్రి 10గంటల ప్రాంతంలో కొండచిలువ కనిపించింది. నెల రోజుల క్రితం గొర్రెల కాపరికి వంకలోని ముళ్లపొదలు, జమ్ము పొదల్లో కనిపించింది. రాత్రివేళలో గొర్రెలు కనపడకుండాపోవటంతో కాపు కాసిన గొర్రెల కాపరికి కనిపించింది. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి వెతికినా దొరకలేదు. సోమవారం రాత్రి తూముకుంట గ్రామస్థులు కొందరికి అయిజ సమీపంలో బక్కమ్మ గుడి దగ్గర వంక పక్కన కనిపించింది. దీంతో జనంలో కలవరం మొదలయ్యింది.

అభ్యర్థులు పరిమితికి లోబడి ఖర్చు చేయాలి : ఎంపీడీవో

అయిజ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఖర్చులు నిబంధనలకు లోబడి ఖర్చు చేయాలని ఎంపీడీఓ భాస్కర్, ప్రత్యేకాధికారి మహేశ్ చెప్పారు. సోమవారం ఉత్తనూర్‌లోని రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అభ్యర్థులు బ్యాంకులో ఖాతా ఓపెన్ చేసి అందులో నుంచి ఎన్నికల ఖర్చులు చేయాలని తెలిపారు. ఐదువేల జనాభా ఉన్న గ్రామాల్లో పోటీచేసే సర్పంచు అభ్యర్థులు మొత్తం రూ.2,50,000, వార్డు సభ్యులు రూ.50,000, అలాగే ఐదువేలలోపు ఉన్న గ్రామ పంచాయతీల్లో సర్పంచు అభ్యర్థులు రూ.1,50,000 వరకు, వార్డు సభ్యులు రూ.30 వేల వరకు ఖర్చు చేయాలని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన, ఓడిన వారు తమ ఖర్చులకు సంబంధించిన వివరాలు అందజేయాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

చాగదోణ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● చాగదోణ గ్రామ సర్పంచు అభ్యర్థి బాబు



చాగదోణలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి బాబు

గట్టు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చాగదోణ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ అభ్యర్థి బాబు అన్నారు. గ్రామాభివృద్ధి కోసం గ్రామంలో అన్నివర్గాల వారి మద్దతు కూడగట్టుకుని చేపట్టబోయే అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ప్రచారంలో ముందుకు సాగుతున్నాడు. ఇంటింటికీ తిరుగుతూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడు. చాగదోణలో మార్పు కోరుకుని నూతన నాయకత్వానికి అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాడు. గ్రామంలోని సమస్యలపై సంపూర్ణ అవగాహణ ఉందని, ప్రజల అభీష్టం మేరకు తాను గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శవంతమైన గ్రామంగా ఏర్పాటు చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ తన సేవలను అందిస్తున్నానని, గ్రామంలో ప్రతీ సమస్యను తీర్చడానికి కృషి చేస్తానని తెలిపారు. అన్నివర్గాల మద్దతు ఉన్నదని, తనను ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాడు. తనను గెలిపిస్తే ప్రజల మధ్యన ఉంటూ నిరంతరం ప్రజల సేవకోసం పని చేస్తానంటున్నాడు. చాగదోణ పంచాయతీ ప్రజలు ఆశీర్వదించాలని ఇంటింటికీ వెళ్లి కోరారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

● చాగదోణ గ్రామ సర్పంచు అభ్యర్థి జె.వీరేశ్ స్వామి



చాగదోణలో ప్రచారం చేస్తున్న జే.వీరేష్‌స్వామి

గట్టు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి తాను పాటుపడతానని చాగదోణ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో నిలిచిన జే. వీరేశ్‌స్వామి అన్నారు. చాగదోణ గ్రామ పంచాయతీకి ఎమ్మెల్యే బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా జే.వీరేశ్‌స్వామి బరిలో నిలిచారు. ఈసందర్భంగా పలు హామీలు ఇస్తూ ప్రజలను కలుస్తున్నారు. చాగదోణ పంచాయతీ పరిధిలోని శివారు గ్రామం కొత్తపల్లిలో కూడా తనదైన శైలిలో ప్రచారంలో ముందుకు సాగుతున్నాడు. తాను చేపట్టబోయే గ్రామాభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్నాడు. నిరంతరం గ్రామాభివృద్ధి కోసం తాను కృషి చేస్తానని తెలుపుతున్నాడు. గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండి నిస్వార్థంగా గ్రామాభివృద్ధికి సేవ చేస్తానని చెపుతున్నాడు. ఇప్పటికే తన సోదరుడు మాజీ ఎంపీపీ విజయ్ సహకారంతో అన్నివర్గాల వారికి నిత్యం అందుబాటులో ఉంటూ ఇప్పటికే పలు సేవలు అందిస్తున్నాడు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. నిబద్ధతతో పని చేస్తానని, తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

సర్పంచులతోనే గ్రామాభివృద్ధి



ధరూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

ధరూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తాను బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. స్థానిక సంస్థల సర్పంచు ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ధరూర్ మండలంలోని పలు గ్రామాల్లో తాను బలపరిచిన సర్పంచు అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి గట్టు మండల అభివృద్ధికి కృషి చేశానన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. మండలంలోని తాను బలపరిచిన సర్పంచు అభ్యర్థులకు ఈనెల 11న ఓటు వేసి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచు వీరన్నగౌడ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎన్నికల సామగ్రి పరిశీలన



అయిజ ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ బాక్స్‌లను సరిచూస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

అయిజ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల అధికారులు ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎంపీడీఓ భాస్కర్ సోమవారం కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలకు తరలించాల్సిన పోలింగ్ బాక్స్‌లను పరిశీలించారు. సూపరింటెండెంట్ వేంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ మహేశ్‌తో కలిసి బాక్స్‌లను భద్రపరచిన గదులను పరిశీలించారు. వాటిని తరలించటానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో ఏడు ఏకగ్రీవం కాగా, మిగతా 21 పంచాయతీల్లో 2వ విడతలో భాగంగా ఈనెల 14న పోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఉన్న ఈ 21 గ్రామపంచాయితీలకు 81 మంది సర్పంచు అభ్యర్థులు, 191 వార్డు స్థానాలకు 489 మంది వార్డు సభ్యులు ఎన్నిల బరిలో ఉన్నారని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు మొత్తంగా 191 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రత్యేక శ్రద్ధతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తా



మేలచెరువులో ప్రచారం చేస్తున్న సర్పంచు అభ్యర్థి కుర్వ రాముడు, నాయకులు

● మేలచెరువు గ్రామ సర్పంచు అభ్యర్థి కుర్వ రాముడు

గద్వాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేలచెరువ గ్రామాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బలపరిచిన సర్పంచు అభ్యర్థి కుర్వ రాముడు అన్నారు. సోమవారం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎంఏ సుభాన్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అభ్యర్థి కుర్వ రాముడు మాట్లాడుతూ.. తనను గ్రామ సర్పంచుగా గెలిపిస్తే నిర్వహించే అభివృద్ధి పనులను వివరించారు. వర్షం వస్తే ఆర్‌యూబీ నుంచి ప్రజలు బయటకు వెళ్లడానికి ఇబ్బంది ఉందని ఎమ్మెల్యే సహకారంతో రైల్వే వారితో మాట్లాడి అక్కడ నీళ్ల నిల్వ ఉండకుండా చేస్తానన్నారు. దళిత, బీసీ వాడలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేస్తానని అన్నారు. పంచాయతీ కార్యాలయానికి కొత్త భవనం నిర్మిస్తానని, హెల్త్ సబ్‌సెంటర్ ఏర్పాటు చేసి అందరికీ వైద్యం అందే విధంగా చేస్తానని అన్నారు. బీసీవాడ, దళితవాడలలోని పాఠశాలలు అభివృద్ధి చేసి నాణ్యమైన విద్య అందేవిధంగా చేస్తానని వివరించారు. ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వం అందించే ప్రతీ సంక్షేమ పథకంలో సింహభాగం అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తానని వివరించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు సుభాన్ ఆలోచనలు, సూచనలతో అందరినీ కలుపుకపోయి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములను చేసుకుంటానని వివరించారు. అత్యధిక మెజార్టీతో తనను గ్రామ సర్పంచుగా ఎన్నుకోవాలని కోరారు.

అందుబాటులో ఉంటా.. అభివృద్ధి చేసి చూపిస్తా

● మేలచెరువు గ్రామ సర్పంచు అభ్యర్థి వేణుగోపాల్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న మేలచెరువు గ్రామ సర్పంచు అభ్యర్థి వేణుగోపాల్‌రెడ్డి

గద్వాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలో పక్కా ప్రణాళికతో ఉన్నా.. ఇప్పటికే నేను చేసిన అభివృద్ధిని కళ్లారా చూశారు అంటూ గద్వాల మండలం మేలచెరువు గ్రామ సర్పంచు అభ్యర్థి వేణుగోపాల్‌రెడ్డి ఓటర్లకు వివరిస్తున్నారు. సోమవారం తన అనుచరులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు పలు హామీలనిచ్చారు. రైల్వే అండర్ బ్రిడ్జితో సమస్యను పరిష్కరిస్తానని, శ్మశానవాటిక బాట సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా అందుబాటులో ఉండి అండగా ఉంటానని అన్నారు. తాను అందరివాడినని మీలో ఒకరిగా ఉన్న తనను సర్పంచుగా గెలిపించాలని కోరారు. అదే స్ఫూర్తితో దళితవా డ, బీసీ కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తానని వివరించారు. కేంద్రం, రాష్ట్రం ఇచ్చే నిధులను సక్రమంగా అందరి సమక్షంలో గ్రామ అభివృద్ధికి వెచ్చిస్తానని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తానని వివరించారు. తనను గెలిపించి గ్రామాభివృద్ధికి, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.

గ్రామంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తా

● కోతులగిద్ద గ్రామ సర్పంచు అభ్యర్థి కురువ గోవిందమ్మ



కోతులగిద్దలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కురువ గోవిందమ్మ

గద్వాల (ధరూర్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని కోతులగిద్ద సర్పంచు అభ్యర్థి కురువ గోవిందమ్మ తెలిపారు. ధరూర్ మండలంలోని కోతులగిద్ద గ్రామ సర్పంచుగా పోటీ చేసిన కురువ గోవిందమ్మ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో తాను గ్రామ సర్పంచుగా ఉన్నప్పుడు ఆంజనేయస్వామి, శివాలయంతో పాటు గ్రామాన్ని అభివృద్ధి చేశానని, పాఠశాల, పంచాయ తీ కార్యాలయ భవనాలను నిర్మించానని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పింఛన్లతో పాటు వివిధ పథకాలను అందించానని వివరించారు. మళ్లీ ఒకసారి అవకాశం కల్పిస్తే గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి నిర్మిస్తానని తెలిపారు. కేంద్రం, రాష్ట్రం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసి, గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం అందించే ప్రతీ పథకాన్ని అర్హులకు అందిస్తానని గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తానని, ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మరోసారి తనను గ్రామ సర్పంచుగా గెలిపించాలని అభ్యర్థించారు.